# వర్గ స్వభావం

"అయ్య సామీ, నీ కాల్మొక్త. ఈడ నుండి ఎల్లిపోమనద్దు."

"మాట్టాడక. నీ బండి తీస్తావా, బయటికి తోసేదా? మేం కొంపలో ప్రశాంతంగా బతకక్కర్లేదా?"

"మావేం జేసినవయ్య నీకు సుకం లేకుండా?"

"నీ చాయ్ దుకాణం చుట్టూ అలగా జనం మూగటం. మా ఇంటికెవరొచ్చినా ఇంటి ముందు నీ తద్దినం. లే, తియ్యవేం బండి."

టీ, బిస్కెట్లు, సమోసాలు, బీడీలు, సిగరెట్లు ఓ చిన్న చక్రాల తోపుడు బండిలో పెట్టుకుని అమ్ముకునే చాయ్ దుకాణం చుక్కమ్మ, యాదగిరిలది. అదో ఎదుగుతున్న కాలనీ. నాలుగు రోడ్ల కూడలిలో ఓ ఇంటి ముందు పేవ్‌మెంట్ మీద బండి పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నారా దంపతులు. ఆ దుకాణం తన ఇంటి ముందు వెలసినప్పటి నుండి ఇంటి యజమాని రామ్మూర్తికదో న్యూసెన్సయిపోయింది. ఆ నాలుగు రోడ్ల కూడలిలో కమ్యూటర్ల కోసం ఆగే ఆటో డ్రైవర్లూ, రిక్షావాళ్ళు, పక్కన అంతస్తుల భవనాలను కట్టే కూలీలు ఆ దుకాణానికొచ్చే కస్టమర్లు. టీ, స్నాక్స్‌ల కోసం వచ్చే జనం తన ఇంటి గేటు ముందే మూగటం. పెద్దగా కబుర్లు చెప్పుకోవటం, జగడాలాడుకోవటం, చుక్కమ్మ ఉల్లి, ఆలుగడ్డలు తీసిన తొక్కలు, గిన్నెల కడుగునీళ్ళతో ఆ ప్రదేశమంతా నానా కంగాళీ అవటం చూసిన రామ్మూర్తి ఇక పట్టలేకపోయాడు. ఆ చాయ్ దుకాణాన్ని అక్కడ నుండి తీసెయ్యమని ఒకటి రెండు సార్లు చెప్పి చూశాడు కూడా రామ్మూర్తి వాళ్ళకు. వాళ్ళతని మాటలు ఖాతరు చేయలేదు. అందుకే ఇవాళ తాడో పేడో తేల్చుకోవాలనే నిర్ధారణకొచ్చాడు అతను.

బండి ముందు చెక్క స్టూలు మీద కూర్చుని టీ కాస్తున్న చుక్కమ్మ అమాంతం లేచి రామ్మూర్తి కాళ్ళ మీద పడిపోయింది.

"లే లే. కాళ్ళ మీద పడ్తే నిన్ను వదిలేస్తాననుకుంటున్నావా? ముందు లేచి మర్యాదగా బండి తియ్యి. లేదూ నేనే వీధిలోకి తోసేస్తాను" అన్నాడు రామ్మూర్తి, ఆమె నుండి దూరంగా తొలగిపోతూ.

"గరీబుది. వదిలెయ్యండి సార్. మీ ఇంట్లో పెట్టుకోలేదుగా దుక్నం" అన్నాడు ఓ ఆటోవాలా ఆమెకు వత్తాసు పలుకుతూ.

"ఏందయ్యోయ్ నీ జబర్దస్తీ. సర్కారోళ్ళ లాందు ఇది. ఫుట్‌పాతు మీద దుక్నం పెట్టుకునేటందుకూ నీ పర్మిషన్ కావల్నేందయ్యా? మంచోడివేలే. ఎల్లు, ఎల్లు" అన్నాడు మునిసిపల్ టాపు నుండి బిందెతో నీళ్ళు పట్టుకొచ్చిన యాదగిరి.

"నాది కాదు నీది జబర్దస్తీ. ఇక్కడ ఫుట్‌పాత్ మీద దుకాణం పెట్టుకోవటానికి మునిసిపాలిటీ పర్మిషన్ తీసుకున్నావా? మీ న్యూసెన్సు భరించటం కష్టమవుతోంది మాకు. వెంటనే ఖాళీ చెయ్యకపోతే ఊర్కోను" అన్నాడు కోపంగా రామ్మూర్తి.

"అట్టనకు దొరా. నీ కాల్మొక్త. ఈడ నుండి పోతే నోటి కాడ కూడు పోద్ది" అంది చుక్కమ్మ మళ్ళీ రామ్మూర్తిని ప్రాధేయపడ్తూ.

"ఏందే, ఆడి కాళ్ళట్టుకుంటావు? ఆడేం మన్ని పెట్టి పోషించటం లేదు" అన్నాడు యాదగిరి.

ఆ ఇంటికి రెండిళ్ళ ముందు వీధికి ఎదురుగా ఉన్న ఇంటి యజమాని పార్థసారథి ఈ చోద్యమంతా చూస్తూ "పోన్లే ఉండనీ. ఏదో బీదవాళ్ళు. బతుకుతారు. కొంత సాంఘిక న్యాయం మనమూ పాటించక తప్పదు" అన్నాడు.

"అట్ట జెప్పయ్య అయ్యకి. పెద్దోళ్ళు కనికరించక పోతే మేం గరీబోళ్ళం బతికేది ఎట్టా" అన్నాడు యాదగిరి.

రామ్మూర్తి గుర్రుగా చూశాడు పార్థసారథి వంక. 'వీడితో ఎప్పుడూ న్యూసెన్సే దేనికీ కలిసిరాడు. బోడి సిద్ధాంతాలూ వీడూ! సాంఘిక న్యాయంట. వీడి శ్రాద్ధం' అని మనసులో తిట్టుకుని, "ఆ సాంఘిక న్యాయమేదో మీ ఇంటి ముందు ఈ తద్దినాన్ని పెట్టుకుని చెయ్యి. నా ఇంటి ముందు మాత్రం ఈ దుకాణం ఉండటానికి వీల్లేదు" అన్నాడు.

"నిజమే. వీడి దుకాణం వల్ల రోడ్డు మీద రోజూ జాతరే. అదిక్కడ నుండి ఎత్తిం చేయాల్సిందే" అన్నాడు రామ్మూర్తి పక్కింటి యజమాని వెంకటస్వామి.

"ఏం జేస్తరండీ మీరు? ఈళ్ళు బండి తీరు. బండి ఈడనే ఉంటది. ఏ నాకొడుకు బండి మీద చెయ్యేస్తడో ఆడి చెయ్యి తెగిపోవాల. మొగోడెవడైనా ఉంటే రండి చూపిస్తా నా తడాకా" అని చాలెంజ్ చేశాడు అప్పుడే వచ్చిన మరో ఆటో డ్రైవరు.

అతనికి పైసలు తీసుకోకుండా టీ ఇచ్చాడు యాదగిరి.

"నువ్వుండన్నా, ఈళ్ళ సంగతేదో నేను తేలుస్తా" అన్నాడు ఆటో డ్రైవరు మరింత ఉత్సాహంగా.

జనం ఈగల్లా మూగారు. ఆటోవాళ్ళు, రిక్షావాళ్ళు, కూలీనాలీ జనం - యాదగిరి, చుక్కమ్మల కష్టమర్లంతా రామ్మూర్తిదే తప్పన్నారు. పేవ్‌మెంట్ మునిసిపల్ లాండ్ కనుక దానిమీద దుకాణం పెట్టుకోవడానికి రామ్మూర్తి, వెంకటస్వామి, ఎల్లయ్య, పుల్లయ్యల పర్మిషన్ అక్కర్లేదని తీర్మానించారు.

"అట్టడుగు వర్గాల దోపిడీ ఇంక సాగద"ని కొత్తగా సామాజిక చైతన్యం పొందుతున్న మేస్త్రీ రాఘవులు హెచ్చరిక చేశాడు.

నిస్సహాయంగా వెనుదిరిగాల్సివచ్చింది రామ్మూర్తీ వెంకటస్వాములకు. బండి మీద చెయ్యేసి వీధిలోకి నెట్టే ధైర్యం లేక ఇంట్లోకి వెళ్ళిపోయారు. అప్పటి నుండి రామ్మూర్తి

కడుపు ఉడికిపోతూనే ఉంది. ఆ దుకాణాన్ని ఎత్తించేయాలన్న పట్టుదల కలిగింది అతనికి. సాయంత్రం బజార్లో కనిపించిన పార్థసారథిని ఉతికేశాడు, "నీ కమ్యూనిస్టు అయిడియాలతో మా ప్రాణం తియ్యక. ఇంటి యజమానిగా నాకు సపోర్టు ఇవ్వాల్సింది పోయి, ఆ అలగా వెధవకి మద్దతు ఇస్తావా" అంటూ.

"ఈ వ్యవస్థలో మనం చెయ్యగలిగింది చాలా తక్కువ. చేతనైనంత చెయ్యాలి. మనం ఉద్యోగస్థులం. మనది ఆర్గనైజ్డ్ సెక్టర్. మనకు అన్యాయం జరిగితే ఎదుర్కోటానికీ, పోరాడటానికీ మనకు సంఘాలున్నాయి. ఉద్యోగంలో భద్రత ఉంది. రేపెలాగా అన్న సమస్య వాళ్ళను ఎదుర్కొన్నట్టు మన్ని ఎదుర్కోదు. అనార్గనైజ్డ్ సెక్టర్‌లోని కూలీ నాలీ జనం. బీదాబిక్కీ పట్ల మనం కొంత కనికరం వహించాలి. సామాజిక న్యాయం చెయ్యలేని మనం నిజానికి ఆత్మగ్లానితో సిగ్గుపడాల్సింది పోయి, వాళ్ళకున్న అవకాశాన్ని కూడా మృగ్యం చేయాలనుకోవడం పాశవికత. ఆ పని నేను చేయలేను" అన్నాడు పార్థసారథి.

"ఇది డిక్టేటర్‌షిప్ ఆఫ్ ద ప్రొలెటేరియట్. దాన్ని చవిచూసే రోజు నీకూ వస్తుందిలే."

"అందుకు బెంగేం లేదు నాకు. వాళ్ళ మానాన వాళ్ళనలా వదిలెయ్యి. మరీ నీ గేటు ముందు కాకుండా కొంచెం పక్కకి దుకాణం పెట్టకోమని చెప్తాలే వాళ్ళకు"

"నీ ఇంటి ముందే పెట్టుకోమని చెప్పకపోయావా?"

"చెప్పాను. ఇప్పుడున్న చోటే వాళ్ళకు కలసి వచ్చిందట. 'ఇక్కడే దుకాణం పెట్టుకుంటాను. అయనేం చేస్తాడో చూస్తాను' అన్నాడు యాదగిరి."

"ఆ సంగతేదో నేను తేలుస్తాలే" అని వెళ్ళిపోయాడు రామ్మూర్తి.

దుకాణం అక్కడి నుండి ఎత్తెయ్యక పోవటం, పైగా అలగా మూకనేసుకుని దౌర్జన్యానికి దిగటం యాదగిరి, చుక్కమ్మలు చేసిన వైయక్తిక అవమానంగా భావించసాగాడు రామ్మూర్తి. తమ ఇంటి ముందు న్యూసెన్స్ గురించి మునిసిపల్ కార్పొరేషన్ వాళ్ళకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులకు ప్రభుత్వ యంత్రాంగం కదలదని ఆయనకి తెలుసు. అందుకే భారీగా ముడుపులు చెల్లించాడు. ఓ రోజు మునిసిపాలిటీ వాళ్ళు పోలీసులను వెంటేసుకుని వచ్చి, ఫుట్‌పాత్‌ల మీదనున్న అన్ని ఎంక్రోచ్ మెంట్లనూ తొలగించేస్తూ, యాదగిరి దుకాణపు బండినీ వీధిలోకి నెట్టారు. బలంగా నెట్టటంతో దాని వెనక రెండు చక్రాలు విరిగాయి. మండుతున్న స్టవ్ అంటుకుని బండి కాలిపోయింది. నేలపాలైన పాత్రల్ని, సమోసాలకు కలిపిన పిండినీ, ఆలుగడ్డలనూ చెత్త కుండీలో పడేశారు పోలీసులు. సిగరెట్లు, బీడీలు, పాన్, వక్కపొడి పొట్లాలు నీటిలో తడిసి వీధిపాలయ్యాయి. "మళ్ళీ ఇక్కడ దుకాణం కనపడ్డదా, ఖబడ్దార్" అన్నారు పోలీసులు.

గుండెలు బాదుకుని ఏడ్చింది చుక్కమ్మ. నిర్వీర్యుడై నిలబడిపోయాడు యాదగిరి. ఉన్న ఒక్క జీవనాధారం పోయింది. మళ్ళీ ఎక్కడికి వెళ్ళాలి? ఎక్కడ దుకాణం పెట్టుకోవాలి? బండి కూడా నాశనమైంది. ప్రపంచమంతా శూన్యంగా కనిపించింది వాళ్ళకి. ఎలా బతకాలో తెలియలేదు వాళ్ళకు. యాదగిరి కస్టమర్లలో ఒకడు సలహా ఇచ్చాడు:

"అళ్ళిల్లిపోయారుగా, మళ్ళీ ఇంకో బండి చేయించుకో. దుక్కం పెట్టుకో. ఆళ్ళు మళ్ళీ ఇంతలో రార్లే" అని.

కానీ, యాదగిరికి ఇదివరకున్న ధైర్యం పోయింది. నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌లో ఊరి దొర పొలంలో జీతగాడుగా పని చేసేవాడు యాదగిరి. అతని తాత, తండ్రి ఆ దొర తాత, తండ్రుల దగ్గరే పనిచేశారు. తాత ఎప్పుడో అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు మనవడి తరంలోనూ తీరలేదు. పెరగటమే కానీ తరగటం లేదు. యాదగిరి తండ్రి కొడుకుకైనా ఈ కట్టు బానిసత్వం నుండి విడుదల కల్పించాలని ప్రయత్నించాడు కానీ, అతని ప్రయత్నం ఫలించలేదు. ఊరి అయ్యవారి దగ్గర కొంచెం చదవనూ, రాయనూ నేర్చుకున్నాడు యాదగిరి. లెక్కలు కట్టటం నేర్చుకున్నాడు. తండ్రికొక్కడే కొడుకు యాదగిరి. తండ్రి మరణానంతరం ఎక్కువ కాలం దొర దగ్గర పని చెయ్యలేదు అతను. 1970లలో ప్రధానమంత్రి ఇందిరా గాంధీ బాండెడ్ లేబర్‌ను చట్టవిరుద్ధమని ప్రకటించిన విషయం ఎవరో అతనికి చెప్పారు. దొర కూడా తన్ను పట్టు బలవంతాన కమతంలో కట్టి ఉంచలేడని అతనికి తెలిసిపోయింది.

స్వతహాగా తెలివిగల వాడవటంతో చట్టాలున్నా అవి అమలు కావటం కష్టమని తెలుసుకున్నాడు అతను. అందుకే దొర కన్నుగప్పి 1980లో భార్యను తీసుకుని ఊర్నుండి పారిపోయి నగరానికి వచ్చేశాడు. అప్పటికతను పాతికేళ్ళ యువకుడు. అంతగా చదువుకోని యాదగిరికి మొదట్లో రిక్షా తొక్కటమే జీవనాధారంగా కనిపించింది. తాను ఆ పని ఎక్కువ కాలం చెయ్యలేడని యాదగిరికి తెల్సు. రెక్కాడితేగాని డొక్కాడని పని అది. కడుపు కట్టుకుని కొంత డబ్బు దాచాడు. అప్పటికే అతనికి ఒక కొడుకు పుట్టాడు. తాను జీవితంలో పైకి రాకపోతే తన కొడుకూ రిక్షావాడే అవుతాడని అతను నిర్ధారించుకున్నాడు. అతని ఆ ఆలోచనే చక్రాల బండిలో చాయ్ దుకాణంగా అవతరించింది. దుకాణం ఎక్కడ పెట్టాలో కూడా ముందుగానే యోచన చేశాడు యాదగిరి. ఆ ఎదిగే కాలనీలో నాలుగు రోడ్ల కూడలి అనువైన ప్రదేశం అనిపించింది అతనికి. అక్కడికి దగ్గరే అతను బాడుగకు ఉండే గుడిసె కూడా. పార్కుకోసం కాలనీవాళ్ళు ఏర్పాటు చేసిన జాగాను ఆక్రమించి గుడిసెలు వేసుకున్నారు కూలీనాలీ జనం. తర్వాత ప్రభుత్వం వాళ్ళకు పట్టాలనిచ్చింది. ఆ గుడిసెల్లో ఓ గుడిసెలో అతను అద్దెకుంటున్నాడు. రెండేళ్ళు వ్యాపారం కూడా బాగా సాగటంతో ఆ జాగా అచ్చివచ్చినట్టుగా కూడా భావించసాగాడు యాదగిరి. భార్యాభర్తలు కష్టపడి పనిచేసేవాళ్ళు. పొద్దున్నే వేకువనే లేచి నాలుగిళ్ళలో పాచిపని చేసేది చుక్కమ్మ. కొడుకును స్కూల్లో వేశాడు యాదగిరి. కొడుకుని స్కూలుకు పంపి, ఎనిమిది గంటలకల్లా తోపుడు బండిని తోసుకుంటూ ఆ నాలుగు రోడ్ల కూడలికి వచ్చేవాళ్ళు భార్యాభర్తలు. యాదగిరి బయటికి వెళ్ళి సామాన్లు తెచ్చేవాడు. చుక్కమ్మ సమోసాలు చేసేది. చాయ్ పెట్టి ఇచ్చేది. ఆటో డ్రైవర్లూ, రిక్షావాళ్ళూ కూలీనాలీ జనం యాదగిరి దుకాణాన్ని ఆదరించారు. కష్టసుఖాలతో మృదువుగా మాట్లాడేవాడు యాదగిరి. ఓ అయిదారు వేల దాకా వెనకెయ్యగలిగాడు.

అలా చక్రాల తోపుడు బండి వ్యాపారం అభివృద్ధిలోకి వస్తున్న తరుణంలో ఈ దారుణం జరిగిపోయింది. మరెక్కడికెళ్ళాలి, ఎక్కడ దుకాణం తెరవాలి అని యాదగిరి ఆలోచిస్తున్న సమయంలో పార్థసారథి వచ్చి, "నువ్వు మరోచోట కొత్తగా బిజినెస్ పెట్టుకుంటే నీ పాత కష్టమర్లంతా పోతారు. మళ్ళీ కొత్తగా మొదలెట్టాల్సి వస్తుంది. ఫుట్‌పాత్ మీద పెట్టుకుంటే ఎప్పటికైనా ప్రమాదమే. మా ఇంటి ముందువైపు కొంత జాగా ఇస్తాను. అక్కడ పెట్టుకో దుకాణం. నీకు డబ్బు సాయమేమైనా కావాలంటే చేస్తాను" అన్నాడు.

"డబ్బక్కర్లేదయ్యా, నువ్వు జాగా ఇచ్చిందే పదివేలు. నా చర్మం చెప్పులు కుట్టించి ఇచ్చినా నీ రుణం తీరదయ్యా" అన్నాడు యాదగిరి కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ.

చుక్కమ్మ అతని కాళ్ళమీదే పడిపోయింది.

"ఛీ ఛీ. నా కాళ్ళమీద పడటమెందుకూ! లేలే. నా తాతలు ముందుగా మేల్కొన్నట్టు నీ తాతలు మేల్కొనలేదు. అందుకు నాకు కృతజ్ఞతలేం అవసరం లేదు" అన్నాడు పార్థసారథి.

"అయ్యా నువ్విచ్చే జాగాకి బాడుగేమి ఇచ్చేది" అని అడిగాడు యాదగిరి.

"నువ్వు నాకేం బాడుగ ఇవ్వక్కర్లేదు. నువ్వు, నీ వాళ్ళూ సుఖంగా ఉంటే అంతేచాలు" అన్నాడు పార్థసారథి.

పార్థసారథి ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడు. కష్టపడి ఎలాగో జాగా కొని ఇల్లు కట్టుకోగలిగాడు కానీ, ప్రహరీగోడ కట్టించలేదు. ఇద్దరు ఆడపిల్లలు, వాళ్ళ చదువులు, ఖర్చులతో ఎప్పటికప్పుడు గోడ కట్టించాలనుకున్నా అతని ఆలోచన సఫలం కాలేదు. అందువల్ల ప్రహరీగోడ కట్టించాల్సిన పని లేకుండానే ఓ మూలగా దుకాణం పెట్టుకున్నాడు యాదగిరి. అది ప్రయివేట్ జాగా కావటంతో తోపుడు బండి అవసరం లేకపోయింది. సిమెంట్ అరుగు ఒకటి కట్టించి దానిపై దుకాణం పెట్టారు యాదగిరి, చుక్కమ్మలు. అలా పార్థసారథి ఇంట్లో మొదలైన యాదగిరి చాయ్ దుకాణం బాగా అభివృద్ధిలోకి వచ్చింది. పొద్దున పూట ఇడ్లీలు, దోసెలు, పూరీలు కూడా అమ్మసాగాడు. తాను అద్దెకుంటున్న గుడిసెనీ, పక్కగుడిసెనీ కొనేసి ఆ స్థలంలో ఓ చిన్న ఇల్లు కట్టుకున్నాడు. యాదగిరి, పార్థసారథి చేసిన మేలు మర్చిపోలేదు. తానున్న జాగాకి అద్దె ఇవ్వలేదు కానీ, అతనికి ఏ పని కావాల్సి వచ్చినా చేసి పెట్టేవాడు. ఫోను బిల్లులు, ఎలక్ట్రిసిటీ, వాటర్ బిల్లులూ కట్టేవాడు. డబ్బు తీసుకునే బిల్లులు కట్టినా, పొద్దునే ఎనిమిది గంటలకల్లా కంపెనీకి వెళ్ళాల్సిన పార్థసారథికి అది ఎంతో సాయం అనిపించేది.

అలా అయిదారేళ్ళు చాయ్ దుకాణం నడిపిన యాదగిరికి అంతటితో తృప్తి కలగలేదు. ప్రొవిజన్ స్టోర్స్ పెట్టాలనుకున్నాడు. ఆ మాటే ఓసారి పార్థసారథికి చెప్పాడు యాదగిరి.

"మంచిదే పెట్టుకో. కష్టపడేవాడికి ఫలితం దక్కకుండా పోదు" అన్నాడు అతను.

"తమరు నాకెంతో సాయం చేశారు. ఆ ధైర్యంతోనే మరో సాయం చెయ్యమని అడుగుతున్నాను. ఈ జాగా నాకు అచ్చి వచ్చింది. తమరు అనుమతిస్తే చాయ్ దుకాణం పెట్టిన స్థానంలోనే ఓ చిన్న గది కట్టుకుంటాను. అందులో దుకాణం పెడ్తాను" అన్నాడు యాదగిరి. డబ్బు రావటంతోపాటు యాదగిరిలో సంస్కృతి పెరిగింది. భాష మారి పోయింది. "నువ్వ"నేవాడు "మీరు," "తమరు" అనటం సాగించాడు.

"నా జాగాలో నువ్వు గది కట్టుకుంటే మునిసిపాలిటీ పర్మిషనిస్తుందటయ్యా" అన్నాడు పార్థసారథి.

"ఓ యాభై గజాలు నాకమ్మేసినట్టు రాసిస్తే మునిసిపాలిటీ వాళ్ళ పర్మిషను నేను తెచ్చుకుంటాను."

"యాభై గజాలంటే మాటలా? గజం అయిదారొందలుంది ఇక్కడ."

"నాకు వట్టిగా ఏం ఇవ్వద్దు సార్. నేను ఆరొందలిస్తాను. అయితే, డబ్బు ఇప్పుడే ఇవ్వమంటే నా వల్ల కాదు. రెండేళ్ళలో ఇస్తాను. మీకు నా మీద నమ్మకముంటే ఓ యాభై గజాలు నా పేర రిజిస్ట్రీ చెయ్యండి."

పార్థసారథి తటపటాయించాడు. అయితే, యాదగిరి మాట కాదనలేకపోయాడు.

"నువ్వు మునిసిపాలిటీ వాళ్ళతో మానేజ్ చెయ్యగలిగితే గది కట్టుకో. స్థలం మాత్రం నువ్వు డబ్బిచ్చాకే రిజిస్టర్ చేస్తాను. ఇలా అన్నానని ఏమనుకోకు. నాకూ డబ్బు ఇబ్బందిగా ఉంది. పెద్ద పిల్ల పెళ్ళి చేయాలనుకుంటున్నాను" అన్నాడు.

పార్థసారథి అనుమతి లభించగానే కాంక్రీట్ స్లాబ్‌తో ఓ పక్కా గది (5' x 10') కట్టాడు యాదగిరి. వెనుక స్థలం తక్కువ ఉండటంతో ప్రహరీ వారగా పొడుగ్గా వచ్చింది గది. మిగతా భాగంలో పార్థసారథిని డబ్బడగకుండా ప్రహరీగోడ కట్టాడు. ఓ చిన్న గేటు కూడా పెట్టాడు.

మునిసిపాలిటీ వాళ్ళొచ్చినప్పుడల్లా కొద్దో గొప్పో ముట్టచెప్తూ కాలం గడిపాడు యాదగిరి. ఆ తర్వాత యాదగిరెప్పుడూ యాభై గజాలు తనకమ్మమని అడగలేదు పార్థసారథిని. పార్థసారథీ ఆ విషయం ఎత్తలేదు. యాదగిరికి బిజినెస్‌లో మంచి తెలివితేటలున్నాయి. ఏడేళ్ళలో వ్యాపారాన్ని బాగా అభివృద్ధి చేశాడు. అతని దుకాణంలో లేని వస్తువు లేదు. ఓ రిక్షావాణ్ణి పెట్టుకుని కస్టమర్ల ఇంటికే సామాన్లు పంపేవాడు. కస్టమర్లతో చక్కగా మాట్లాడే వాడు కనుక, కస్టమర్లూ అతనంటే ఇష్టపడేవాళ్ళు. ఇప్పుడతనికి ఇద్దరు కొడుకులు. కొడుకులకు పదో క్లాసు దాకా చదువు చెప్పించి, ఆ తర్వాత వాళ్ళని కొట్లో కూర్చోపెట్టాడు. వాళ్ళు షాపు మానేజ్ చేస్తుంటే, మార్కెట్ నుండి సరకులు తెప్పించటం, పిల్లలకు సలహా చెప్పటం, పైపై సూపర్‌విజన్ చెయ్యటం మాత్రం చేసేవాడు. కొత్తగా చీట్ల వ్యాపారం పెట్టాడు. అది కూడా బాగానే కలిసి వచ్చింది అతనికి. చుక్కమ్మ పాచిపన్లు చెయ్యటం ఎప్పుడో మానేసింది. పిల్లలు ఎక్కొచ్చేదాకా భర్తకు వ్యాపారంలో సాయం చేసింది. పిల్లలు కొట్టు మానేజ్ చేసుకోవటంతో ఇంట్లోనే ఉండి వంటావార్పులు చూసుకునేది. మిగతా టైమ్‌లో టీవీతో కాలక్షేపం చేసేది.

పార్థసారథి కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేశాడు. పెద్ద కూతురు పెళ్ళయిన అయిదేళ్ళకు రిటైరయ్యాక, వచ్చిన డబ్బుతో రెండో కూతురి పెళ్ళి చేశాడు. రెండో కూతురు పెళ్ళయిన సంవత్సరానికి అతని భార్యకు జబ్బు చేసింది. అప్పుచేసి చికిత్స చేయించాడు కానీ, క్యాన్సరు వ్యాధి అవటంవల్ల ఖర్చు చేసిన డబ్బు బూడిదలో పోసిన పన్నీరయింది. ఆపైన మనిషి కూడా దక్కలేదు.

భార్య పోయాక ఇంక అతనికి హైదరాబాద్‌లో ఉండ మనస్కరించలేదు. పెద్ద కూతురు ముంబైలోనూ, చిన్న కూతురు చెన్నైలోనూ ఉన్నారు. తల్లి పోయినప్పటి నుండి చిన్న కూతురు అతన్ని వచ్చి తమతో ఉండమని పదేపదే ఫోన్లు చేస్తోంది. భార్య చికిత్స కోసం చేసిన అప్పులున్నాయి, తానూ బతకటానికీ కొంత డబ్బు కావాలి. అందుకే ఇల్లు అమ్మేయాలన్న నిర్ణయానికొచ్చాడు అతను.

ఓ రోజు యాదగిరిని పిల్చి చెప్పాడు, "నువ్వు ముందు ఆవరణలో యాభై గజాలు కొంటానన్నావుగా? నువ్వు కొనదల్చుకుంటే నీకే ఆ స్థలం అమ్మేస్తాను. ఇల్లు కూడా అమ్మేయాలనుకుంటున్నాను" అని.

"ఎంతకమ్ముతున్నారు?" అడిగాడు యాదగిరి.

"స్థలమే గజం మూడు వేలు ఉంది మార్కెటు రేటు. ఇల్లు పాతబడిపోయింది. దాని కెక్కువ రాదు. ఓ ఎనిమిది తొమ్మిది లక్షలయినా వస్తుందనుకుంటాను."

"నేను కొట్టు గది కట్టబోయే ముందు గజం ఆరొందలని ఖరారు చేసుకున్నాం గదా! అయిదు వందలని మీరంటే, ఆరొందలని నేనే చెప్పాను."

"చెప్పావు నిజమేనయ్యా. నువ్వు డబ్బివ్వలేదుగా?"

"డబ్బివ్వకపోతే మాత్రం, మాట తప్పటం న్యాయమా?"

మాట తప్పావని అన్నందుకు పార్థసారథికి మనసుకు కష్టమేసింది.

"నేనేం మాట తప్పలేదు. ఇప్పటికి పది హేనేళ్ళుగా నువ్వా జాగాలో బిజినెస్ చేసు కుంటున్నావు. నాకు నువ్వు పైస ఇవ్వలేదు, నేనూ అడగలేదు. ఇన్నాళ్ళ నుండి ఉంటున్నావు కనుక నీకే ప్రిఫరెన్స్ ఇచ్చి ఆ యాభై గజాల స్థలం నీకే అమ్ముదామనుకుంటున్నాను. నువ్విప్పుడు లేనివాడివి కాదు. మార్కెట్ ధర చెల్లించి నీ స్థలం నువ్వు తీసుకో."

"ఇవ్వకేం చేస్తారులెండి! పన్నెండేళ్ళున్న తర్వాత ఉన్న వాడిదే స్థలం అని చట్టం ఉన్నదట."

"నువ్విలా అనటం నాకేం బాగాలేదు, యాదగిరీ! నా భార్య క్యాన్సరుతో తీసుకు పోయింది. నాకు నాలుగైదు లక్షలు ఖర్చయ్యాయి. అప్పులు చెయ్యాల్సి వచ్చింది. నేనేం గవర్నమెంటు ఉద్యోగం చెయ్యలేదు, పెన్షనుతో బతకటానికి. పెద్దమ్మాయి పెళ్ళికే ప్రావి డెంట్ ఫండ్‌లో చాలా భాగం తీసి ఖర్చుపెట్టాను. నేను రిటైరయినప్పుడు వచ్చిన గ్రాట్యు టీతో చిన్నమ్మాయి పెళ్ళి చేశాను. కొద్దో గొప్పో మిగిలినా తిండికీ, నా భార్య చికిత్సకీ

ఖర్చయ్యాయి. అప్పులు తీర్చాలంటే ఇల్లమ్మక తప్పదు. ఇల్లమ్మితే అప్పులూ అవీ పోగా నాతో మూడు నాలుగు లక్షలు మిగుల్తాయి. దానిమీద వచ్చే వడ్డీతో బతకాలనుకుంటు న్నాను. చిన్నపిల్ల రమ్మని రాస్తోంది. ఇల్లమ్మేసి అక్కడకు వెళ్తాను. ఏమైనా ఈ వయసులో డబ్బుకి పిల్లలమీద ఆధారపడటం నాకిష్టంలేదు" అంటూ ఓర్పుగా, విపులంగా తన పరిస్థితినంతా విడమర్చి చెప్పాడు పార్థసారథి.

"సరే చూద్దాం లేండి" అని వెళ్ళిపోయాడు యాదగిరి.

పార్థసారథి ఇంటికి బేరం పెట్టగానే, యాదగిరి పంపిన లాయరు నోటీసు అందింద తనికి. "తన క్లయింటు ఫలానా చోట అద్దె చెల్లిస్తూ గది కట్టుకుని వ్యాపారం చేసుకుంటు న్నాడనీ, టెనెన్సీ యాక్ట్ ప్రకారం అతని స్వాధీనంలో ఉన్న యాభై గజాల స్థలం అతని హక్కుభుక్తంలోకి వస్తుందనీ, పార్థసారథి తన క్లయింటుకు చెందిన యాభై గజాల స్థలం (కొట్టుతో సహా) అమ్మచూపినా, అమ్మినా తన క్లయింటు న్యాయంకోసం కోర్టును ఆశ్రయిం చాల్సి వస్తుందనీ, ఆపై జరిగే వాటన్నిటికీ పార్థసారథే బాధ్యుడనీ" ఉంది ఆ నోటీసులో.

లాయరు నోటీసందుకున్న పార్థసారథి, కొట్లో యాదగిరి కనపడకపోతే అతనింటి కెళ్ళాడు.

పార్థసారథిని చూసి, "రండి రండి" అని మర్యాద చేసి సోఫాలో కూర్చోబెట్టాడు యాదగిరి.

"సరేగానీ, ఈ పనేమిటయ్యా యాదగిరీ! నాకు లాయరు నోటీసు పంపిస్తావా? నేను నీకు చేసిన కీడేమిటి? నీకేం అన్యాయం చేశానని నువ్వు కోర్టుకు వెళ్తావు! నువ్వు నా స్థలంలో ఉన్నందుకు నాకు ఈ పదిహేనేళ్ళుగా అద్దె చెల్లిస్తున్నావా? ఇంత ద్రోహం పనికి రాదయ్యా!" అనడిగాడు పార్థసారథి ఆవేశంగా.

"మీరు ఆవేశపడి కోపం తెచ్చుకున్నందువల్ల వ్యవహారాలు పరిష్కారం కావు. నేనిప్పటికీ నా మాటమీదే ఉన్నాను. గజం ఆరొందల చొప్పున ఇచ్చెయ్యండి. ప్రహరీగోడ కూడా నేనే నా ఖర్చుతో కట్టించాను. అందుకు నేను మిమ్మల్ని పైసా ఇమ్మనటం లేదు. మీరు ఇప్పటిదాకా నా పట్ల ఉదారంగా ప్రవర్తించారు. అందుకే నేనూ మీపట్ల ఉదారంగా ఉంటాను. మిమ్మల్ని నష్టపెట్టి నేను బావుకునేదేం లేదు" అన్నాడు యాదగిరి.

ఈ మాటలన్నీ వింటున్న చుక్కమ్మ, "లాయరు నోటీసేందయ్యా? అయ్య మనసు కష్టపెట్టకు. మనం బాగుపడం" అంది.

"నీకేం తెలీదు నువ్వూరుకో" అని కసిరాడు భార్యను యాదగిరి.

"మార్కెట్ రేటు మూడు వేలుంటే నీకీ స్థలం ఆరొందలకమ్మను" అన్నాడు పార్థసారథి.

"మరి కోర్టులో తేల్చుకుందాం" అన్నాడు యాదగిరి.

"కోర్టులో నువ్వెలాగూ గెలవ్వు. ఎందుకంటే నువ్వు నాకద్దె చెల్లించిన రసీదులేవీ నీ దగ్గర లేవు. నా స్థలం, నా అవసరానికి అమ్ముకోకుండా ఇబ్బంది మాత్రం పెట్టగలవు.

కోర్టు వ్యాజ్యం సంవత్సరాలు గడుస్తుంది అని నాకు తెల్సు. అందుకు భయపడి నీకు స్థలం చౌకగా అమ్ముతానని మాత్రం అనుకోకు. నేను ఆ యాభై గజాలు అమ్మకోకుండా నువ్వు కోర్టు నుండి ఇంజెంక్షన్ మాత్రం తీసుకు రాగలవు. ఆ యాభై గజాలు వదిలేసి మిగతా స్థలం, ఇల్లూ అమ్మేస్తున్నాను. ఆ యాభై గజాల కోసం నేను కోర్టుకెక్కను, నీకు రాయను" అన్నాడు పార్థసారథి.

"మీరెలా అంటే అలా. నేనెప్పుడు మీ మాట కాదన్నాను" అన్నాడు యాదగిరి.

ఇంక మాట్లాడేదేం లేనట్టు గిరుక్కున వెనక్కి తిరిగి పోబోతున్న వాడల్లా ఓ క్షణమాగి, "అబద్ధాల వల్ల జీవితం సుఖవంతమవుతుందేమో కానీ మనసు, ఆత్మ దెబ్బతినిపోతాయి, యాదగిరీ! నీకిప్పుడు కాకపోయినా ఎప్పుడోప్పుడు అది అవగతమవక మానదు. అప్పటికి నువ్వెక్కడుంటావో, నేనెక్కడుంటానో? సరే, వస్తాను" అని వెళ్ళిపోయాడు పార్థసారథి.

ఆవరణలోని యాభై గజాలు వదిలేసి తొమ్మిది లక్షలకు ఇల్లమ్మేశాడు పార్థసారథి. మర్నాడు చెన్నై వెళ్ళిపోతాడనగా రామ్మూర్తి వచ్చాడు పార్థసారథి ఇంటికి.

"ఆ యాదగిరి గాడికి యాభై గజాల స్థలం ధారాదత్తం చేశావుటగా? నేనప్పుడే చెప్పాను, ఈ గాడిదలను దగ్గరకు తీయొద్దూ అని. సాంఘిక న్యాయం, గాడిదగుడ్డూ అంటూ నాకేవో పాఠాలు బోధించావు. చూశావా, ఇప్పుడేమైందో? దిసీస్ వాట్యూ కాల్ ద డిక్టేటర్‌షిప్ ఆఫ్ ప్రొలెటేరియట్!" అన్నాడు.

నవ్వాడు పార్థసారథి. "అదేమిటో నీకర్థం కాదులే. ఇప్పుడా చర్చ ఎందుకు గానీ, ఓ మాట మాత్రం నేను నీకు చెప్పాలి. యాదగిరి నా స్థలం ఆక్రమించుకున్నందుకు నేనేం తప్పు పట్టను. అతని వర్గ స్వభావం మారిపోయింది. అందువల్లే అతని ప్రవర్తన అలా ఉంది. అతనిప్పుడు కార్మికుడు కాదు, యజమాని. యజమాని అయ్యాక ఆ వర్గ స్వభావం రాకుండా ఎలా పోతుంది? ఇలాంటి సమాజంలో చిన్న చేపను పెద్ద చేప మింగటం సహజం. ఇల్లు అమ్మినందువల్ల వచ్చిన డబ్బు నాకు చాలు. యాదగిరి మోసం చేశాడని బాధపడాల్సిన అవసరం నాకు లేదు."

"నువ్వనుకున్న, ఆశించిన కార్మిక కర్షక రాజ్యం కూడా మారిపోయింది కదయ్యా!"

అందుకేం మాట్లాడలేదు పార్థసారథి.

పార్థసారథి ఇంటిని కొన్న కాపిటలిస్ట్, ఇంటిని కూలగొట్టి ఉన్న స్థలంలో నాలు గంతస్తుల పెద్ద భవనం కట్టాడు. అందులో సూపర్ బజార్ పెట్టాడతను.

అందులో దొరకని వస్తువేం లేదు. చక్కగా, పాలీథీన్ శాషేల్లో, క్రెడిట్ కార్డుల సౌలభ్యంతో వస్తువులందిస్తూంటే ఓ ఏడాదిలోనే అది బాగా పాపులర్ అయిపోయింది.

యాదగిరి వ్యాపారం బాగా పడిపోయింది. నాలుగంతస్తుల భవన ప్రాంగణానికి అనుమతినిచ్చే సందర్భంలో మునిసిపాలిటీవాళ్ళు రోడ్లు వెడల్పు చేసే కార్యక్రమంలో భాగంగా ఇంటిముందు మూడు గజాల స్థలం వదలిపెట్టాలని ఆదేశించారు. అలా మూడు గజాల స్థలం వదలిపెట్టి ఆ భవనం నిర్మాణమైంది.

కుడిపక్కగా మూడు గజాలు రోడ్డు మీదకి పొడుచుకు వచ్చిన యాదగిరి దుకాణం, కాపిటలిస్ట్ శరీరం మీద పుట్టిన పుండులా సలపరం కలిగించసాగింది.

అది అక్రమ నిర్మాణమని మునిసిపాలిటీ వాళ్ళకు ఫిర్యాదు చేయడంతో, అక్రమ నిర్మాణాలను కూల్చే కార్యక్రమంలో భాగంగా, యాదగిరి కోర్టుకెళ్ళకుండా శనివారం సాయంత్రం నోటీసిచ్చి, ఆదివారంనాడు అతని దుకాణాన్ని కూలగొట్టేసింది మునిసిపాలిటీ సిబ్బంది.

దుకాణంలో ఓ గజం వెడల్పు స్థలం మాత్రం మిగిలింది యాదగిరికి.

కొట్టును పైకి జరిపి కట్టుకోవాలనుకున్నాడు కానీ, సూపర్‌బజార్ యజమాని యాదగిరిని పిల్చి, "మళ్ళీ ఆ జాగాలో ఏమన్నా కట్టాలని ప్రయత్నిస్తే నడుములు విర గ్గొడతా" అని బెదరించాడు.

దిక్కుతోచని యాదగిరి తనకక్కడ యాభై గజాల స్థలం ఉందా లేదా అన్న విచికిత్సలో పడిపోయాడు. తనకు సాయం చెయ్యటానికి పార్థసారథి అక్కడ లేడు.

"పార్థసారథి ఉసురు ఊర్కే పోదు. నిన్ను దయతల్చిన మనిషిని మోసం చెయ్యాలని చూసిన నీ పాతకం నిన్ను కట్టి కుదుపుతుంది" అన్నాడు రామ్మూర్తి.

యాదగిరి స్థితి పదిహేనేళ్ళ క్రితం ఉన్న పరిస్థితి కాదు. అక్కడ దుకాణం పోయినా మరోచోట దుకాణం తెర్చుకోగలడు కానీ, అప్పటి ధైర్యం సన్నగిల్లిపోయింది అతనిలో.

వర్గ మార్పిడితో ఆ జాడ్యాలన్నీ అంటుకున్నాయతన్ని. తనకంతకు ముందుదాకా తెలియని ఆత్మ ఏదో అతన్ని వేధించసాగింది. అతను మనో వ్యాధితో మంచం పట్టాడు.

**'ఇండియా టుడే', 7 నవంబర్, 2000.**